# సీఎం కేసీఆర్‌తోనే సుపరిపాలన ..

- బోరబండలో పాదయాత్ర, ఇంటింటి ప్రచారం..
- రోడ్ షోకు ప్రజలు బ్రహ్మరథం
- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్



బోరబండ డివిజన్‌లో ఆదివారం చేపట్టిన ప్రచారంలో భాగంగా స్థానికులకు ఎన్నికల మ్యానిఫెస్టో అంశాల పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్

ఎర్రగడ్డ, అక్టోబర్ 22: జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ కొనసాగిస్తున్న ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నది. ఆదివారం ఆయన బోరబండ డివిజన్ ఎన్ఆర్ఆర్ పురం సైట్–1 కాలనీ, మధురానగర్‌లలో పాదయాత్ర చేస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. ఆయా ప్రాంతాల్లోని ప్రధాన రహదారి పొడవునా రోడ్‌షో నిర్వహించగా స్థానికులు బ్రహ్మరథం పట్టారు. పలు చోట్ల మహిళలు గోపినాథ్‌కు మంగళ హారతులతో తిలకందిద్ది స్వాగతం పలికారు. మైనార్టీలు అధిక సంఖ్యలో ఉండే సైట్–1, మధురానగర్‌లలో గులాబీ సైన్యంతో గోపినాథ్ అడుగులు వేస్తుంటే మహిళలు, యువకులు సహా గులాబీ జెండాలతో ఆహ్వానించారు. మధ్యలో ఓ చిల్లా వద్ద మైనార్టీ సోదరులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులను ఉద్దేశించి మాగంటి మాట్లాడుతూ.. సుపరిపాలనకు మారుపేరైన కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం తథ్యమని పేర్కొన్నారు. బోరబండను బంగారు బండగా తీర్చిదిద్దే బాధ్యతను డివిజన్ ప్రజలు తనకు అప్పగిస్తే ఆచరణలో పెట్టి చూపించానని ఉదాహరణలతో సహా వివరించారు. కేవలం ఎన్నికల సమయంలో ప్రత్యక్షమై సాధ్యంకాని హామీలను గుప్పించే పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని గోపినాథ్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నుంచి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, విజయకుమార్, కోఆర్డినేటర్ విజయ సింహ, ఇన్‌చార్జి సిరాజ్, లక్ష్మణ్‌గౌడ్, ఎం.ఆనంద్‌కుమార్, రమేశ్‌యాదవ్, రామకృష్ణ, షరీఫ్, మునీర్, దేవమణి, యాదయ్య, బాబానాయక్, బాబూరావు, వీరేశం, శివకుమార్‌గుప్త, వెంకటేశ్, సాయిచరణ్, ఖలీల్, సత్యనారాయణ, యాదగిరి, బొట్టుశివ, చంద్రకళ, యూసుఫ్,కలీం పాల్గొన్నారు.



పాదయాత్రలో భాగంగా ఎమ్మెల్యే మాగంటికి మంగళహారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు



పాదయాత్రలో భాగంగా చిల్లా వద్ద ఎమ్మెల్యే గోపినాథ్..



హరిహరక్షేత్ర దేవస్థాన ప్రాంగణంలో జరిగిన చండీ హోమంలో భక్తులు

## దుర్గాదేవి రూపంలో అమ్మవారు..

ఎర్రగడ్డ, అక్టోబర్ 22: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆదివారం దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో వెలసిన మండపాలతో పాటు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. బోర బండ స్వరాజ్‌నగర్‌లోని హరిహర క్షేత్ర దేవస్థానం ప్రాంగణంలో చండీ హోమాన్ని నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు. పలు మండపాల వద్ద సద్దుల బతుకమ్మ సంబురాలు వైభవంగా జరిగాయి.



కృష్ణకాంత్ పార్కులో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, కార్పొరేటర్ దేదీప్య రావు , తదితరులు



శ్రీనగర్ కాలనీ, ఎస్‌బీఐ కాలనీలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, తదితరులు

## సందడిగా బతుకమ్మ వేడుకలు

వెంగళరావునగర్, అక్టోబర్ 22 : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం రాత్రి కనులపండువగా జరిగాయి. బస్తీలు, కాలనీల్లో భారీ ఎత్తున సద్దుల బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతికి మారు పేరు అయిన బతుకమ్మ వేడుకల్లో చిన్నాపెద్దా అనే తేడాలేకుండా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కృష్ణకాంత్ పార్కులో, శ్రీనగర్ కాలనీలోని ఎస్‌బీఐ కాలనీలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, కార్పొరేటర్ దేదీప్య రావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రచార కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరి..

### 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలి..

### జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి




రాజకీయపార్టీలతో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ ఆర్వో రవి, చిత్రంలో ఏసీపీ

జూబ్లీహిల్స్, అక్టోబర్ 22 : రాజకీయ పార్టీలు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని.. ప్రచార కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరని సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి.రవి పేర్కొన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్‌తో కలిసి నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే బహిరంగ సభలు, సాధారణ ర్యాలీలు, పాదయాత్రలు, బైక్ ర్యాలీలకు 48 గంటల ముందు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికల చట్టం ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సేవా ఎస్లావత్, ఏఈఆర్ఓలు ఏసీపీ రాణి, ఏఎంసీ కమల్, తాసీల్దార్ నయీముద్దీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి బెంగళూరు తరలింపు
- తొండుపల్లి వద్ద నిందితులు అరెస్టు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 22: శంషాబాద్‌లో ఆదివారం భారీ ఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ రూరల్, ఎస్‌వోటీ పోలీసులు కలిసి ఆదివారం హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారి తొండుపల్లి వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఓ వాహనంలో తరలిస్తున్న రూ.29లక్షల విలువజేసే 102 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

## రాజేంద్రనగర్‌లో బీసీల ఐక్యతకు కృషి ..

బండ్లగూడ, అక్టోబర్ 22: రాజేంద్రనగర్‌లో బీసీల ఐక్యతకు కృషి చేస్తామని నూతనంగా నియమితులైన అంతరం నరేశ్ తెలిపారు. ఆదివారం రాజేంద్రనగర్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడిగా అంతరం నరేశ్‌ను నియమించి.. నియమకపత్రాన్ని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో అశోక్‌గౌడ్, రాజు యాదవ్, ఫయాజ్, ప్రవీణ్, భాస్కర్, తదితరులు ఉన్నారు.



## వైభవంగా శ్రీవారి రథోత్సవం

శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేరళ సంప్రదాయ వాయిద్యాలు, డప్పులు, కోలాటాల నడుమ స్వామివారి రథాన్ని శ్రీనగర్ కాలనీ పురవీధుల్లో లాగారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఆలయ చైర్మన్ రామయ్య, ఈవో లావణ్య, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

*– బంజారాహిల్స్,అక్టోబర్ 22*